క్లుప్తంగా

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



లలిత పారాయణం చేస్తున్న మహిళ భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున బాబాకు హారతి ఇచ్చిన అనంతరం ఉదయం 8 గంటలకు విభూది, పంచామృతాలతో అభిషేకాలను చేపట్టారు. ఉదయం 10 గంటలకు మహిళలు బాబా కీర్తనలు ఆలపించారు. లలితా సహస్రనామావళి పఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం హారతి, బాబా పల్లకీ సేవ, బాబా పాదాల ఊరేగింపు ఉత్సవం చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులతో పాటు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

చురుగ్గా కాల్వ అభివృద్ధి పనులు



భగత్‌సింగ్‌నగర్‌లో కాల్వ పనులు జరుగుతున్న దృశ్యం

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు భీమిలి నియోజకవర్గం భగత్‌సింగ్ నగర్‌లో ప్రధాన కాల్వ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జీవీఎంసీ నిధులు రూ.22 లక్షలతో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు అప్పుడు ప్రారంభమైనా ఎన్నికల కారణంగా జాప్యం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. కాల్వ నిర్మాణం పూర్తయితే మురుగు సమస్యలు తగ్గుతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ మిత్రపక్షాలు చొరవ తీసుకోవాలి

అగనంపూడి: కేంద్రంలో రాష్ట్ర ఎంపీల ప్రాధాన్యం పెరిగిన క్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్.నరసింగరావు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న దీక్ష శిబిరంలో 1211వ రోజు, గురువారం ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కేంద్రంలో ఏర్పాటు కానున్న ఎన్డీఏలో టీడీపీ మిత్రపక్షం ప్రాధాన్యం రెట్టింపు అయిందని, ఇదే సమయంలో విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే రాష్ట్రానికి సాగు, తాగు నీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు విషయంలో కూడా చొరవ తీసుకోవాలన్నారు. అర్ధంతరంగా నిలిచిన ప్రాజెక్టును పూర్తి చేసి ఆ ఖ్యాతిని దక్కించుకోవాలన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రైతుబజారుకు పెరుగుతున్న ఆదరణ

- రోజూ 2 వేల మందికి పైగా కొనుగోలుదారుల రాక
- ప్రస్తుతం దుకాణాలు నిర్వహిస్తున్న 79 మంది రైతులు
- డ్వాక్రా మహిళల ద్వారా ప్రత్యేక స్టాల్స్
- స్టాళ్లు పెంచితే మరింత మందికి ఉపాధి



రైతుబజార్‌లో కొనుగోళ్ల సందడి



52వ వార్డులోని మర్రిపాలెం రైతు బజారు

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలిలోని మర్రిపాలెం రైతు బజారుకు వినియోగదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే అన్ని రకాల కూరగాయలు, నిత్యావసర సరుకులు లభిస్తుండటంతో ఇక్కడే కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతు బజారు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

రూ.7 లక్షలతో మౌలిక సౌకర్యాలు

మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుబజారులో ఇటీవల రూ.7 లక్షలతో మౌలిక సౌకర్యాలు పెంపొందించారు. దుకాణాలు నిర్వహించే రైతులకు ఇబ్బంది లేకుండా కొత్తగా రేకులను వేశారు. రైతుబజారుకు వెనుక ఉన్న ఖాళీ స్థలం పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా ప్రాంగణంలో దుకాణాల ముందు ఫ్లోరింగ్ చేశారు.

నిత్యం 2 వేల మంది కొనుగోలుదారులు

మర్రిపాలెం రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఈ రైతుబజారుకు శాంతినగర్, అంబేడ్కర్ నగర్, ఉడా లే అవుట్, ఎన్ఏడీ సెంటర్, మర్రిపాలెం, మాధవధార, మురళీ నగర్ తదితర ప్రాంతాల నుంచి ప్రతీ రోజూ 2 వేలు మందికి పైగానే కొనుగోలుదారులు వస్తున్నారు. దీంతో నెలకు సాలీనా రూ.1.20 లక్షల వరకు రైతు బజారుకు ఆదాయం వస్తోంది. రైతు బజారు నిర్వహణ చూసేందుకు ఒక ఎస్టేట్ అధికారి, అటెండర్, స్కావెంజర్లు ఉన్నారు. వీరి వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోను రైతు బజారు ద్వారా ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం లేకున్నా, నగర వాసులకు తక్కువ ధరకే కూరగాయలు, నిత్యావసర సరకులను అందించాలనే లక్ష్యం నెరవేరుతోంది.

స్టాళ్లు పెంచితే మేలు

రైతుబజారులో ప్రస్తుతం 94 మంది రైతులు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం 79 మంది రైతులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాకుండా డ్వాక్రా గ్రూపు మహిళలు, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి, బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నారు. రైతు బజారుకు వచ్చే కొనుగోలుదారులు పెరుగుతున్నందున, మరికొన్ని స్టాళ్లు ఏర్పాటు చేసినట్‌లెతై, అటు రైతులకు ఉపాధి చూపించినట్లవుతుంది. అంతే కాకుండా వినియోగదారులకు కూడా మరిన్ని తాజా కూరగాయాలు లభ్యమవుతాయి. మార్కెటింగ్ శాఖ అధికారులు దీనిపై తగిన చొరవ తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

స్టాల్స్ పెంపు గురించి అధికారుల దృష్టికి ..



రైతు బజారు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. రోజూ ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తెరిచి ఉంటుంది. ప్రతీ బుధవారం సెలవు. జిల్లా అధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఏ రోజుకారోజు కూరగాయల ధరలను నిర్ణయించి రైతులకు, వినియోగదారులకు మేలు చేసేలా దృష్టి సారిస్తున్నాం. రైతు బజారులో స్టాళ్లకు రైతుల నుంచి డిమాండ్ ఉంది. దీనిపై మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–కొమ్మనాపల్లి వరహాలు, ఎస్టేట్ అధికారి, మర్రిపాలెం రైతు బజారు

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



బాబాకు పూజలు చేస్తున్న అర్చకుడు



మంత్రపుష్ప పూజలో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం బాబాకు పంచామృతాలతో అభిషేకం చేసి, భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. సాయంత్రం బాబాకు హారతి ఇచ్చారు. అనతరం భక్తులంతా సామూహికంగా సాయి సంకీర్తనలు ఆలపించారు. మంత్రపుష్పం జపించారు. ప్రత్యేక హారతుల అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు విళ్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సర్వీస్ రోడ్డు ఇలా.. నడిచేదెలా?



రాకపోకలెలా: హిమచల్‌నగర్ సర్వీస్‌రోడ్డులో ఇరువైపులా పార్కు చేసిన కార్లు



బస్సుకు దారేదీ: ఇందిరాకాలనీకి వెళ్లే మార్గంలో అడ్డుగా పెట్టిన కాంక్రీట్ మిక్సర్

మల్కాపురం: సర్వీస్ రోడ్డుల్లో వాహనాలను పార్కు చేయడంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 59వ వార్డు హిమచల్‌నగర్‌కు వెళ్లే మార్గంలో స్థానికులు తమ కార్లను సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేశారు. దీంతో ఆ మార్గంలో కనీసం ఆటో కూడా రాలేని పరిస్థితి ఉంటోంది. 60వ వార్డు ఇందిరా కాలనీ నుంచి గుల్లలపాలెం, వుడా కాలనీ, బర్మాకాలనీకి వెళ్లే మార్గం మధ్యలో బోరుబావి ఉంది. రాత్రివేళల్లో పాదచారులు ఈ బోరుబావిని గుర్తించలేక గాయాల పాలవుతున్నారు. అలాగే ఇదే వార్డు ఇందిరా కాలనీ నుంచి జవహర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ఓ భవన నిర్మాణ కాంట్రాక్టర్ కాంక్రీట్ మిక్సర్‌ను సర్వీస్ రోడ్డులో నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో పలు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ మార్గంలో జనతాకాలనీకి ఆర్టీసీ బస్సు ప్రయాణిస్తుంది. కాంక్రీట్ మిక్సర్ అడ్డుగా ఉండటంతో ఆర్టీసీ బస్సు రాకపోకలు కష్టమవుతున్నాయి. అధికారులు స్పందించి, సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

లలిత పీఠంలో ప్రత్యంగిరా హోమం



లలితపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : స్థానిక లలితపీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితపీఠంలో ప్రతీ నెల అమావాస్య రోజున ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్టు తెలిపారు. హోమంలో పాల్గొన్న వారికి సర్వదుష్ట గ్రహ బాధలు, శత్రు ప్రయోగ బాధలు, ఆర్థిక, అనారోగ్య, కుటుంబ బాధలు తొలగిపోయి, కోరికలు తీరుతాయన్నారు. అలాగే ఉదయం పీఠంలో శనీశ్వరుని జయంతి సందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

మాధవధారలో పోలీసుల బందోబస్తు



షాపుల వద్ద పరిశీలిస్తున్న సీఐ చక్రధర్

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలో గురువారం సాయంత్రం ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ప్రాంతంలో సంత నిర్వహించడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ చక్రధర్ సిబ్బందితో కలిసి సాయంత్రం నుంచి రాత్రి వరకు పరిశీలించారు. చుట్టుపక్కల రెండు మూడు కిలోమీటర్ల దూరం నుంచి అన్ని వర్గాల ప్రజలు సంతకు వచ్చి సరకులు కొనుగోలు చేసుకుంటారు. ఈ క్రమంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలపై చర్చ



యూనియన్ నాయకులతో చర్చిస్తున్న ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిటూ) విశాఖ జిల్లా నాయకులు గురువారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో చర్చించారు. చర్చలు అనంతరం ప్రధాన వైద్యాధికారి సిటూ నాయకులతో మాట్లాడుతూ ముఖ్యంగా సేఫ్టీ పరికరాలు, రెయిన్‌కోట్లు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫాం, మాస్కులు, గ్లౌజులు, గమ్ముబూట్లు ఇస్తామని, అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.7లక్షలు, అలాగే బకాయి హెల్త్ అలవెన్స్, కార్మికులకు ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారని యూనియన్ నాయకులు తెలిపారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు చేస్తామని, డెత్, 60 ఏళ్ల దాటిన లాంగ్ ఆబ్సెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోమన్నారన్నారు. చర్చల్లో యూనియన్ అధ్యక్షుడు టి నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జేఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన నిధి

- నిరుద్యోగులకు పెన్నిధి జిల్లా కేంద్ర గ్రంథాలయం
- అందుబాటులో వేల పుస్తకాలు



సాహితీ ప్రియుల కోసం తెలుగు నవలలు



పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న నిరుద్యోగులు



వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు పేపరుతో తయారు చేసిన వస్తువులు

డాబాగార్డెన్స్ : నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తోంది జిల్లా కేంద్ర గ్రంథాలయం. సుమారు 7 దశాబ్దాలుగా విద్యార్థులు, నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోంది. ఆరేడు దశాబ్దాల కిందట కేజీ హెచ్ అప్ రోడ్డులో ఉండే జిల్లా కేంద్ర గ్రంథాలయం అనివార్య కారణాల వల్ల దశాబ్దం క్రితం జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో మెలోడి థియేటర్ వద్ద ప్రైవేట్ భవనంలోకి మార్చారు. ఎందరికో విజ్ఞానాన్ని అందిస్తూ ప్రగతిపథంలో దూసుకుపోతోంది.

అన్ని వర్గాల వారికి అందుబాటులో..

ఈ గ్రంథాలయం అన్ని వర్గాలకు అందుబాటులో ఉంది. విద్యార్థులు, నిరుద్యోగులు, చిన్నారులు, సాహితీప్రియులు, వృద్ధులు ఇలా అందర్నీ అలరిస్తూ విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తూనే ఉంది. పోటీ పరీక్షలకు వెళ్లే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంది. వీరి కోసం ప్రత్యేకంగా ఓ గది కేటాయించారు. పుస్తకాలు చదువుకునేందుకు ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. రోజుకు సుమారుగా 150 నుంచి 200 మంది ఈ గ్రంథాలయానికి వస్తుంటారు.

పాఠకులపై ప్రభావం చూపని డిజిటల్ యుగం

సెల్‌ఫోన్ యుగం వచ్చిన తరువాత ప్రపంచం ముంగిట నిలుస్తోంది. అయితే డిజిటల్ గ్రంథాలయాలు కూడా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఈ ప్రభావం గ్రంథాలయాలపై పడుతుందేమోనని చాలా మంది పుస్తక ప్రియులు ఆందోళన చెందారు. కానీ ఆ ప్రభావం గ్రంథాలయాలపై లేదని గ్రంథాలయాధికారి చెబుతున్నారు. పాఠకులు, పుస్తకప్రియుల సంఖ్య తగ్గడం లేదని చెబుతున్నారు.

పాఠకులను ఆకట్టుకునేందుకు.. : పాఠకులను ఆకట్టుకునేందుకు గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజెప్పేందుకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పలు సంస్థలు, రిసోర్స్ పర్సన్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాహితీ కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యం

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని గ్రంథాలయ అధికారి తెలిపారు. వీరికి ఏ రకమైన పోటీ పరీక్షల పుస్తకాలు అవసరమో గమనించి వాటిని కొనుగోలు చేస్తున్నామన్నారు.

దివ్యాంగుల భవితపై ప్రత్యేక శ్రద్ధ



దివ్యాంగ బాలలతో డీఈవో చంద్రకళ, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసరావు

అగనంపూడి: దివ్యాంగుల భవితను ఆశాజనకంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భవిత కేంద్రాలు కృషి చేస్తున్నాయని విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక, శారీరక వైకల్యంతో బాధపడే పిల్లలకు ఈ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. సిబ్బంది వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, గాజువాక మండల విద్యాశాఖాధికారులు సునీత, విశ్వనాథం, ఏపీఎస్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ బాబూరావు, సర్వశిక్షా అభియాన్ కో–ఆర్డినేటర్ గీత, సీఎంవో అప్పలనాయుడు, సిరి ఫౌండేషన్ ప్రతినిధి ఎల్వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

◆ సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.



నిత్య కల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మహిళపై దాడి కేసులో ఒకరికి జైలు

సబ్బవరం: మహిళపై దాడి చేసిన కేసులో మండలంలోని పైడివాడ అగ్రహారానికి చెందిన ఓ వ్యక్తికి అనకాపల్లి కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్టు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పెచ్చేటి దుర్గారావు, గుండాల సంతోషి పక్కపక్క ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సంతోషి తమ ఇంటి వద్ద గతంలో రిగ్గు బోరు తీయిస్తుండగా బోరు నుంచి వస్తున్న బురద దుర్గారావు ఇంటిపై పడింది. దీంతో వివాదం చెలరేగింది. పెచ్చేటి దుర్గారావు.. సిద్దయ్య భార్య సంతోషిని రాయితో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. 2022 మార్చి 12న సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనకాపల్లిలోని 12వ ఏఎంఎం కోర్టు 324 ఐపీసీ సెక్షన్ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానాతో పాటు 509 ఐపీసీ సెక్షన్ కింద అదనంగా మరో సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

ఇందిరా స్టేడియానికి కొత్త హంగులు



ఇందిరా మున్సిపల్ స్టేడియం

జగదాంబ: ఇందిరా మున్సిపల్ స్టేడియం కొత్త హంగులు సంతరించుకుంది. 1972 నాటి స్టేడియానికి జీవీఎంసీ రూ.5 కోట్లపైగా నిధులు కేటాయించింది. దీంతో స్టేడియం రూపురేఖలు పూర్తిగా మారిపోయింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దిన ఈ స్టేడియం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.